క్లుప్తంగా

శ్రీవారి సేవకు తరలిన భక్తులు

బొంరాస్‌పేట: తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో సేవకులుగా పని చేసి, శ్రీవారి కృపకు పాత్రులు కావాలని వారు భావించారు. తమవంతు సేవ చేసేందుకు మండల పరిధి రేగడిమైలారం భక్తులు 11 మంది ఆదివారం తిరుపతికి వెళ్లారు. టీటీడీ సేవకుల ఆర్గనైజర్ చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో క్షవారి సేవ టీమ్‌లీడర్ దాసరి రాములు, కె.నర్సింహులు, కర్రె వెంకట్రాములు, కడంపల్లి పెద్దలాలప్ప, చంద్రప్ప, ముసులగల్ల బాబు, కడంపల్లి వెంకటయ్య, పురుషోత్తం, నర్సింహులు తిరుమలకు వెళ్లారు. ఈ నెల 27 నుంచి వారం రోజుల పాటు దేవస్థానంలో భక్తులకు పలు రకాల సేవలు అందించేందుకు వెళ్తున్నట్లు పేర్కొన్నారు.

రేషన్ లబ్ధిదారులకు ఈకేవైసీ తప్పనిసరి

దోమ: రేషన్ లబ్ధిదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రేషన్ డీలర్ దగ్గర ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దార్ నర్సింహులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ దుకాణాల్లో ఎలాంటి అవినీతి అక్రమాలకు వీలులేకుండా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈకేవైసీ ప్రక్రియను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ గడువు ఈ నెల 29వ తేదని వెల్లడించారు.

అసత్య ఆరోపణలు సరికావు

మండల విద్యాధికారి చంద్రప్ప

బంట్వారం: గౌరవ ప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ.. తనపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరి కాదని ఎంఈఓ చంద్రప్ప ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా రిసోర్స్ పర్సన్ల ఎంపిక చేశానంటూ తనపై టీయూటీఎఫ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్, సతీష్‌కుమార్‌లు చేసిన వ్యాఖ్యలను ఎంఈఓ తీవ్రంగా ఖండించారు. తాను నిష్పక్షపాతంగా, నిక్కచ్చిగా విధులు నిర్వహించడం కొందరికి నచ్చకపోవచ్చన్నారు. సల్బత్తాపూర్ ఎస్‌జీటీ వెంకటేశంను రిసోర్స్ పర్సన్‌గా ఎంపిక చేసి, గుజరాత్‌లో జరిగిన శిక్షణా తరగతులకు పంపేలా డీఈఓ కార్యాలయం నుంచి ఈ నెల 9న లేఖ వచ్చిందని ఎంఈఓ పేర్కొన్నారు. ఆ ఆదేశాల మేరకే వెంకటేశంను శిక్షణా తరగతులకు పంపించినట్లు వెల్లడించారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని తెలిపారు. అసత్య ఆరోపణలు మానుకోవాలంటూ సంఘం నేతలకు హితవు పలికారు. రోజుకో ఉపాధ్యాయుడిని వెంటేసుకుని తిరుగుతూ, విధులకు ఆటంకం కలిగిస్తున్నానంటూ తనపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని యెడలా అసత్య ఆరోపణలు చేసిన సంఘం నాయకులపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

అయోధ్యకు తరలిన రామభక్తులు



రామమందిరానికి వెళ్లిన రామభక్తులు

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల నుంచి రామభక్తులు అయోధ్య భవ్యరామమందిరాన్ని చూడటానికి తరలివెళ్లారు. ఆదివారం అయోధ్యకు ప్రత్యేక రైలు వెళ్తున్న నేపథ్యంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, రామభక్తులు వెళ్లారు. వెంకటయ్య, రవి, కృష్ణ, గోపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

కుల్కచర్ల: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ముజాహిద్‌పూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి అన్నారు. ఆదివారం మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.5లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కలిసికట్టుగా ముందుకుసాగుతామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రభూపాల్, నాయకులు కృష్ణయ్య, భాస్కర్, బాలకృష్ణయ్య, షర్ఫుద్దీన్, వెంకటేష్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌రెడ్డి నియామకంపై హర్షం

షాద్‌నగర్ రూరల్: రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్‌గా టీయూడబ్ల్యూజె (ఐజేయూ) జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని రాష్ట్ర కార్యదర్శి గుడుపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యలు తెలిసిన నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి అని చెప్పారు. ఆయన నియామకంపై సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో 'ప్రత్యేకత' కనిపించేనా!

- పని ఒత్తిడిలో స్పెషల్ ఆఫీసర్స్
- ఒక్కో అధికారికి అధిక బాధ్యతలు
- సమస్యలపై దృష్టిసారించాలంటున్న గ్రామస్తులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మాజీ సర్పంచ్‌ల డిమాండ్



గ్రామ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్: గ్రామ పంచాయతీల్లో సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఈ పాలనలో నాన్‌గెజిటెడ్ అధికారులను జాబితా నుంచి తొలగించారు. గెజిటెడ్ అధికారులు సరిపడా లేకపోవడంతో ఒక్కో అధికారికి మూడు నాలుగు జీపీల పాలనా బాధ్యతలు అప్పగించారు. కొన్ని మండలాల్లో ఐదు ఊర్లను కేటాయించారు. అయితే.. మండలంలోని 33 గ్రామపంచాయతీల బాధ్యతలను కేవలం 10 మంది స్పెషల్ ఆఫీసర్లు స్వీకరించారు.

పని ఒత్తిడి..

పార్లమెంటు ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో ఎన్నికల నిర్వహణలో ఆయా మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర గెజిటెడ్ అధికారుల భాగస్వామ్యం తప్పనిసరి కానుంది. గెజిటెడ్ హోదాలో ఇప్పటికే సొంత శాఖలో చేయాల్సిన విధులతో పాటు, అదనంగా మరో మూడు నాలుగు పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించి, బాధ్యతలు కట్టబెట్టడంతో పనిభారం పెరిగిందని కొందరు అధికారులు వాపోతున్నారు. అదనపు బాధ్యతలతో అన్ని గ్రామాలను సందర్శించుకునేందుకు సమయం లేక, ఫోన్లలోనే పంచాయతీ సిబ్బందికి పనులు అప్పగిస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రత్యేక అధికారులకు పనిభారం పెరగడంతో, వారు పల్లె పట్టున ఉండని పరిస్థితి నెలకొందని, స్థానికంగా ఉండే పాలకులు కరువై.. పల్లెల్లో అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వినవడుతున్నాయి.

బిల్లుల మంజూరు కోసం..

సర్పంచుల పదవీకాలం ముగియడంతో తమ పాలన కాలంలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు మంజూరు అవుతాయో లేదా అనే మీమాంసలో మాజీ సర్పంచులు ఉన్నారు. ఆరు నెలల నుంచి పంచాయతీలకు నిధులు రాకపోవడంతో సర్పంచులే చేతినుంచి సొంత నిధులు వెచ్చించారు. ఒక్కో సర్పంచ్‌కు రూ.3నుంచి రూ.5లక్షల వరకు నిధులు రావాల్సి ఉంది. పెద్ద పంచాయతీల్లో అయితే మరింత అధికంగానే ఉంది. ప్రత్యేక అధికారులకు కార్యదర్శికి సంయుక్తంగా చెక్‌పవర్ ఉండడంతో నిధుల ఖర్చు గతంలో పనులకు చెల్లించాల్సిన నిధుల గురించి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పల్లెల్లో పర్యటిస్తున్నాం..



ప్రభుత్వ ఆదేశాల మేరకే పల్లెల్లో ప్రత్యేక పాలన నిర్వహిస్తున్నాం. మాకు కేటాయించిన గ్రామాల్లో నిత్యం పర్యటిస్తున్నాం. ప్రజా, గ్రామ సమస్యలపై ఆరా తీసి, వాటి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. పెండింగ్ బిల్లుల విషయమై జిల్లా అధికారులకు నివేదిస్తాం. – విజయలక్ష్మి, ఎంపీడీఓ, దౌల్తాబాద్

ముగిసిన క్రికెట్ పోటీలు

విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్‌ఐ



క్రీడాకారులకు నగదు, జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్

ధారూరు: స్పీకర్ గడ్డ ప్రసాద్‌కుమార్ సతీమణి శైలజ స్మారకార్థం పక్షం రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ టోర్నీలో 38 జట్లు పాల్గొన్నాయి. ఇందులో సెమీ ఫైనల్‌కు చేరుకున్న నబీల్, పలాన్ ఇరుజట్లు.. తుదిపోరులో తలపడగా.. విన్నర్‌గా నబీల్, రన్నర్‌గా పలాన్ టీంలు నిలిచాయి. ఈ సందర్భంగా.. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ విజేత జట్టుకు రూ.25 వేలు, ప్రోత్సాహక కప్పు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు, జ్ఞాపికను అందజేశారు. ఇందులో ఆర్గనైజర్లు జహీర్ అబ్బాస్, మోసిన్, కార్తీక్‌రెడ్డి, బాబా ఖురేషి, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ బాబాఖాన్, ముజాఫర్, బీఆర్‌ఎస్ నాయకుడు హఫీజ్, ఎంఐఎం మండల అధ్యక్షుడు మోయిజ్ ఖురేషి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సేవలు అభినందనీయం



వైద్యపరీక్షల కోసం గ్రామస్తులను ఆసుపత్రికి తీసుకెళ్తున్న నాయకులు

కుల్కచర్ల: పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ముజాహిద్‌పూర్ మాజీ సర్పంచ్ లక్ష్మి అన్నారు. ఆదివారం మండల పరిధి ముజాహిద్‌పూర్ గ్రామంలో అనారోగ్యంతో బాధపడుతున్న కొందరిని, వివిధ ఆరోగ్య పరీక్షల నిమిత్తం మరికొందరిని టీఆర్‌ఆర్ ఆసుపత్రికి బస్సులో తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమం కోసం ఎమ్మెల్యే చేస్తున్న కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అధికారంలో లేని సమయంలో సొంత నిధులతో నిరుపేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ భాస్కర్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



అనంత బృందావనంలో కల్యాణోత్సవం

పెద్దేముల్: జనగాం గ్రామ శివారులోని అనంత స్వామి ఆశ్రమ బృందావనంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణం ఘనంగా జరిగింది. వరుడి తరఫున జనగాం గ్రామానికి చెందిన అనంతయ్య స్వామి కుటుంబ సభ్యులు, వధువు తరఫున భక్తుడు నర్సింహులు కుటుంబ సభ్యులు కూర్చుని వివాహం జరిపించారు. ఉత్సవంలో కడప జిల్లా ముడుమల్ల గ్రామానికి చెందిన వీర బ్రహ్మేంద్ర స్వామి శిష్యుడు సిద్దయ్య 7వ సంతతికి చెందిన రామకృష్ణ పరబ్రహ్మస్వామి పీఠాధిపతి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

సంతలేక చింత

- నిధులు మంజూరై మూడేళ్లయినా మోక్షం లేదు
- మర్పల్లిలో భూమిపూజకే పరిమితం
- స్థల సేకరణకు నోచుకోని పట్లూరు



మండల కేంద్రంలో దుకాణ సముదాయ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలం

మర్పల్లి: వారాంతపు సంత అంటేనే క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతుంటుది. దానికి ఒక ప్రత్యేక దుకాణ సముదాయం ఉంటే మరీ మంచిది. కానీ మర్పల్లి మండల కేంద్రలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణ ఆవరణలో, పట్లూర్‌లో రోడ్డు పక్కన అంగడి కొనసాగుతుండటంతో వాహనదారులు, ప్రయాణికులు, వ్యాపారులు, కొనుగోలుదారులు ఇలా ప్రతి ఒక్కరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో దుకాణ సముదాయాలను నిర్మించేందుకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం నిధులు మంజూరు చేసింది. కానీ నేటి వరకు వాటి ఊసేలేదు.

పూజతోనే సరి..

ఉపాధిహామీ పథకం కింద మండల పరిధి పట్లూర్, మర్పల్లి గ్రామాల్లో చేపట్టనున్న కూరగాయల దుకాణాల సముదాయం కోసం చిరు వ్యాపారులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఈ పథకం కింద 2019–2020 ఆర్థిక సంవత్సరానికి గాను, పట్లూర్‌లో రూ.10 లక్షలు, మర్పల్లి మండల కేంద్రంలో రూ.15 లక్షలతో దుకాణ సముదాయం నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో మండల కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాల వెనకాల, ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఎదుట భవనాన్ని నిర్మించేందుకు, ఆగస్టు 15,2021న నాటి ఎంపీడీఓ భూమి పూజ చేయగా.. పట్లూర్‌లో అసలు స్థలమే గుర్తించలేదు.

రోడ్డుపైనే..

పట్లూర్‌లో ప్రతి ఆదివారం రోడ్డుకు ఇరువైపులా సంత జరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిధులు కేటాయించి, మూడేళ్లు అయినా ఇంతవరకు దుకాణ సముదాయానికి అతీగతి లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చిరువ్యాపారులను దృష్టిలో పెట్టుకొని, దుకాణ సముదాయాన్ని నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బస్టాండ్ ఆవరణలో..

మర్పల్లి మండల కేంద్రంలో కూరగాయల సంత బస్టాండ్ ఆవరణలో కొనసాగుతోంది. దీంతో ప్రయాణికులు, ఆర్టీసీ డ్రైవర్లు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మర్పల్లి మీదుగా నడిచే బస్సులు.. సంతరోజైన మంగళవారం బస్టాండ్ ఆవరణలోకి తీసుకురాని పరిస్థితి. బస్టాండ్‌కు కిలో మీటరు దూరాన ఉన్న తహసీల్దార్ కార్యాలయం వరకు తీసుకెళ్లి, వెనకకు తీసుకురావాల్సి వస్తున్నట్లు డ్రైవర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి, సంతను మరో ప్రదేశానికి మార్చాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. మరోచోట దుకాణ సముదాయం నిర్మిస్తే ఎవరికీ ఏ ఆటంకం కలగదని వాహనదారులు కోరుతున్నారు.

నిజాయితీ చాటుకున్న వ్యక్తి



బాధితుడికి మొబైల్‌ను అందజేస్తున్న ఎస్‌ఐ

బొంరాస్‌పేట: రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్ పోలీసుల ద్వారా సదరు బాధితుడికి అప్పగించాడు ఓ వ్యక్తి. ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ప్రధాన దారిలో రూ.25వేల విలువ చేసే సెల్‌ఫోన్ పడుంది. అటుగా వెళ్తున్న రాఘవేందర్ యాదవ్ .. ఫోన్‌ను గుర్తించి, దానిని పోలీసులకు అందజేశాడు. ఎస్‌ఐ రవూఫ్ విచారణ చెపట్టగా.. మండల పరిధి మెట్లకుంటకు చెందిన సమ్మగల్ల శేఖర్ మొబైల్‌గా తెలిసింది. సదరు వ్యక్తిని పిలిపించి, రాఘవేందర్ చేతుల మీదుగా ఎస్‌ఐ మొబైల్‌ను అందజేశారు. నిజాయితీని చాటుకున్న రాఘవేందర్‌ను పోలీసులు అభినందించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో విద్యార్థులు

దోమ: మండల కేంద్రం జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1994–95 బ్యాచ్ చెందిన విద్యార్థులు.. 29 సంవత్సరాల తర్వాత ఒకే వేదికపై సందడి చేశారు. నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ విద్యార్థుల్లా కేరింతలు కొట్టారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు శశిధర్, శేషయ్య, బిచ్చిరెడ్డి, మహేందర్, మల్లయ్యలను ఘనంగా సత్కరించారు.

రైతులపై దాడులకు నిరసనగా నేడు ధర్నా

పరిగి: కేంద్ర ప్రభుత్వం రైతులపై చేస్తున్న దాడులకు నిరసనగా సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీర్ మహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ రైతులు ఢిల్లీలో ధర్నా చేస్తుండగా.. వారిపై పోలీసులకు దాడి చేయడంతో ఓ రైతు మృతి చెందాడని చెప్పారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరసన వ్యక్తంచేస్తున్న రైతులపై కేంద్ర ప్రభుత్వం పోలీసులతో దాడులు చేయించి, రైతు మృతికి కారణం అయిందంటూ ఆరోపించారు. దీనికి నిరసనగా.. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడతామని, ఇందులో సీపీఐ, కార్మిక సంఘాలు పాల్గొని, ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇళ్ల మధ్యే మురుగు



ఖాళీ స్థలంలో మురుగు నీరు

పరిగి: ఇళ్ల మధ్యలో మురుగు నీరు నిల్వ ఉండటంతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పట్టణ కేంద్రంలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్క వీధిలో గుడికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో మురుగు జలాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఫలితంగా దోమలు, ఈగలు పెరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేశామని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిస్థితి ఇలాగే ఉంటే రోగాలు చుట్టుముడతాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.

ఘనంగా మల్లన్న బోనాలు

షాబాద్: మల్లన్న పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య, పోతు రాజుల విన్యాసాలతో నెత్తిన బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ప్రదక్షిణలు చేసి, స్వామివారికి బోనం సమర్పించారు. కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని కోరుకున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే తదితరులు

పరిగి: ప్రతి ఒక్కరూ భక్తి మార్గాన్ని ఎంచుకోవాలని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సునీతారెడ్డి అన్నారు. మండల పరిధి మిట్టకోడూర్ గ్రామంలో మాణిక్ ప్రభు ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆమె పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడారు. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భక్తి మార్గంతోనే ముక్తి లభిస్తుందని సూచించారు. ముఖ్యంగా యువత భక్తి మార్గాన్ని ఎంచుకుంటే.. ఎంతో లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పురాతనమైన ఆలయ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కృషి చేస్తామని, భక్తులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు ఆలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పార్టీలో చేరుతున్న శివకుమార్‌గుప్తా తదితరులు

చేవెళ్ల: కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. చేవెళ్లలో పార్లమెంట్ స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి మంత్రి హాజరయ్యారు. చేవెళ్ల మండలంలోని ఊరేళ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కుంచం శివకుమార్‌గుప్తా తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్, సత్యనారాయణరెడ్డి, శైలజ, సమత, ఆగిరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఆయన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శివకుమార్‌గుప్తా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలను చూసి పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్‌లో ఉంటూ పేదలకు ప్రభుత్వం అందజేయనున్న సంక్షేమపథకాలు చేరే విధంగా తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఆయన వెంట మంగళి శ్రీనివాస్, ఊరేళ్ల గ్రామానికి చెందిన యువకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉప సంఘం

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- అనాలోచితంగా తీసుకొచ్చిన జీఓతో ఇబ్బందులు
- 317 తొలగింపునకు ఉన్నతాధికారులతో అభిప్రాయ సేకరణ

షాద్‌నగర్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా తీసుకొచ్చిన 317 జీఓతో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కుటుంబాలను విచ్ఛిన్నం చేయడంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. పాలన పారదర్శకంగా సాగాలన్నా, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నా ఉపాధ్యాయులు స్థానికంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 317జీఓలోని సమస్యల పరిష్కారానికి మార్గాలను చూపించేందుకు మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈ సబ్ కమిటీ వివిధ శాఖల ఉన్నతాధికారులతో అభిప్రాయాలను సేకరిస్తుందని పేర్కొన్నారు. సబ్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోనుందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందన్నారు. ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం అయినా సంక్షేమానికి పెద్దపీట వేసిందని చెప్పారు. ప్రభుత్వం ఈ నెల 27న చేవేళ్లలో మరో రెండు గ్యారంటీలు అమలు చేయనుందని, ఈ పథకాల అమలుతో సుమారు 70 శాతం మంది పేదలకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, అందెమోహన్, ముబారక్, రాయికల్ శ్రీను, గంగనమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం..

ప్రభుత్వం కులగణన చేసేందుకు నిర్ణయం తీసుకోవడంతో బీసీ ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాలువా కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీజీ శ్రీనివాస్, నాగరాజు, శ్రీనివాసులు, వెంకట్, వెంకటేశ్వర్లు, ఉదయ్‌కుమార్, బాలస్వామి, సత్యం, రాజు, రాములు, సురేష్, క్యాసెట్ శ్రీను పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో

ప్రభుత్వం 317 జీఓ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సబ్ కమిటీని ఏర్పాటు చేయడంతో ఉద్యోగ సంఘం నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఉద్యోగులు మహేందర్‌రెడ్డి, అమరేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, దత్తాత్రేయ, శశిధర్, రమేశ్, ప్రకాశ్, నీరజ, శ్రావణి, సుకన్య, పద్మలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

భక్తిభావం భావం అలవర్చుకోవాలి

షాబాద్: ప్రతిఒక్కరూ దైవ చింతన అలవర్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ సర్పంచ్ మునగపాటి స్వరూప నర్సింహులు, ఎంపీటీసీ వనిత పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలో సర్దార్‌నగర్ గ్రామంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచరణాల మధ్య సర్దార్‌నగర్ గ్రామం మార్మోగింది. భక్తులు ఓంనమశివాయ..శంభోశివశంకర నామాస్మరణను జపించారు. మధ్యాహ్నం 11గంటలకు కల్యాణం జరిగింది. జగదీశ్‌గుప్తా, రాంమోహన్‌గుప్తా, సరేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట: సమాజంలో ప్రతిఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల శివారులోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం శకటోత్సవం (బండ్లు తిరుగుట)ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం అయన మాట్లాడుతూ సమాజంలో భక్తిభావం కలిగి ఉంటేనే మనస్సు ప్రశాంతంగా ఉంటుందన్నారు. స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు సురేష్‌రెడ్డి, మంజుల రాజశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ వీరేష్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, పల్లె అనంద్‌కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.